సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 28 । జూలై । 2023



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



వీడిన మిస్టరీ

ఒడిశాకు చెందిన యువకుడి అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. మద్యం మత్తులోనే గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. 8లో

గరిష్టం/కనిష్టం
30.3°/20.1°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

30న విద్యుత్ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

అనంతపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యుత్ ఉద్యోగుల కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఈ నెల 30న అనంతపురం రాజేంద్ర నగర పాలక సంస్థ పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి రోషన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 35 మంది నామినేషన్లు వేయగా, 23 మంది అభ్యర్థుల నామినేషన్లు అర్హత సాధించినట్లు వెల్లడించారు. 30న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,800 మందికిపైగా ఉద్యోగులు సొసైటీలో ఓటర్లుగా ఉన్నారన్నారు.

దిగిరాని టమాట

- కక్కలపల్లి మండీలో కిలో రూ.132 పలికిన వైనం



అనంతపురం అగ్రికల్చర్: సామాన్యులకు అందకుండా కొండెక్కి కూర్చున్న టమాట దిగి రానంటోంది. గురువారం అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.132 మేర పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 105 టన్నుల కాయలు అమ్మకానికి రాగా వాటిని వేలం వేశామన్నారు. అందులో కిలో గరిష్టంగా రూ.132, కనిష్టంగా రూ.100, సరాసరిన రూ.116 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయని వెల్లడించారు.


నేడు హెచ్చెల్సీకి నీరు



నీటితో కళకళలాడుతున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్/అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయానికి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది. గురువారం ఒక్క రోజే 10 టీఎంసీల నీరు చేరింది. బుధవారం 98,357 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో గురువారం ఉదయానికి 1,11,566 క్యూసెక్కులకు పెరిగింది. మంగళవారం 40 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, బుధవారం ఉదయానికి 50 టీఎంసీలకు చేరింది. ఈ క్రమంలో శుక్రవారం హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయనున్నారు. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్‌మగళూరు, వరనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డ్యాంకు వరద భారీగా వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1,615.56 అడుగులకు చేరింది. ఈ ఏడాది ఆయకట్టులో వరి, మిరప పంటలు సాగు చేసేందుకు ఇప్పటికే రైతులు బోరు బావుల కింద నారుమడులు వేసుకుని సిద్ధంగా ఉన్నారు. హెచ్చెల్సీకి శుక్రవారం జలాశయం నుంచి నీరు విడుదల వుతున్న నేపథ్యంలో ఎస్ఈ రాజశేఖర్, ఈఈ వెంకటరమణారెడ్డి సరిహద్దులోని హెచ్చెల్సీ కాలువను పరిశీలించారు. కాలువపై గస్తీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



యాప్ డౌన్‌లోడ్ గురించి సిబ్బందికి తెలియజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణారెడ్డి

నల్లమాడ: 'వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులు సోకకుండా నివారించండి' అని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి (డీఎం అండ్‌హెచ్‌ఓ) ఎస్‌వీ కృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. ఎద్దులవారిపల్లి, గోపేపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణుల రక్తహీనతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించవచ్చన్నారు. ఐరన్ మాత్రలు, సిరప్ పంపిణీ చేస్తున్నారా అంటూ చిన్నారులు, గర్భిణులతో ఆరా తీశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గోపి, సిబ్బంది ప్రేమలత, వెంకటేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా మొహర్రం



గంటాపురంలో బత్తలపల్లి పీర్లుతో భేటీ తీసుకుంటున్న గంటాపురం పీర్లు

బత్తలపల్లి: జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మొహర్రం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా బత్తలపల్లి కాశీంస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాశీంస్వామి పీర్లు గ్రామాల పర్యటనకు వెళ్లాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పీర్లు ఘన స్వాగతం పలికాయి. మండలంలోని బత్తలపల్లి, గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాల్లో ఉదయం పీర్లను ఊరేగించారు. వందలాది మంది భక్తులు గ్రామోత్సవాల్లో పాల్గొన్నారు. శనివారం జలధి సందర్భంగా బత్తలపల్లి కూడలిలో జరిగే భేటీకి రమ్మని ఆహ్వానించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ముజావర్లు తెలిపారు. అలాగే సంజీవపురం పీర్లు ఈదుల ముష్టూరుకు చేరుకుని భేటీ తీసుకున్నాయి. ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ టీవీ శ్రీహర్ష ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షించారు. గంటాపురంలో మాజీ సర్పంచు సింగారం నాగేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



పోట్లమర్రి గుండం వద్ద అలావ్ తొక్కుతున్న భక్తులు

ఆకాశమే హద్దు..

డ్రోన్ల వాడకంపై యువత, రైతులకు శిక్షణ

- తొలిదశలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఏర్పాటు
- కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో రక్షా అకాడమీలో కార్యకలాపాలు
- జిల్లా యువతకు పెరగనున్న ఉపాధి అవకాశాలు

డ్రోన్‌ల వినియోగంలో నూతన శకం ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వ చొరవ, ప్రోత్సాహంతో సుశిక్షితులైన డ్రోన్ పైలెట్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలతో సహా వివిధ రంగాల్లో విస్తృత ప్రయోజనాలు అందిస్తున్న డ్రోన్‌ల వినియోగం, నిర్వహణపై శిక్షణనిచ్చేందుకు ఏపీలో మూడు సంస్థలకు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ అనుమతులు ఇచ్చింది. వాటిలో రెండు గుంటూరు జిల్లాలో, ఒకటి శ్రీసత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేశాయి. జీఎంఆర్ గ్రూపు అనుబంధ సంస్థ రక్షా అకాడమీ డ్రోన్ శిక్షణ అందించేందుకు డీజీసీఏ అనుమతులు పొందింది. కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో ఏర్పాటైన ఈ అకాడమీలో వివిధ కేటగిరీల డ్రోన్‌లపై శిక్షణ, నిర్వహణపై కోర్సులు నిర్వహిస్తున్నారు.



(ఏపీ నెట్‌వర్క్)

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపుతున్నారు. వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగం ద్వారా విప్లవమే తీసుకురావచ్చని భావించి దేశంలో ఎక్కడా లేని విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత, రైతులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడంతో పాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విస్తృత ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

డ్రోన్ కార్పొరేషన్ ఏర్పాటు..

ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ (ఏపీడీసీ)ను 2018 నవంబరులో ఏర్పాటు చేశారు. ఎం.మధుసూదన్‌రెడ్డి దీనికి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేయటంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగాన్ని పెంచేందుకు కార్పొరేషన్ కృషి చేస్తోంది. డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధి, తయారీ, నిర్వహణ రంగంలో ఉన్న స్టార్టప్ కంపెనీలకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. డీజీసీఏ నిబంధనల మేరకు డ్రోన్ల నిర్వహణను క్రమబద్ధం చేయటంతో పాటు రక్షణాత్మక చర్యలు చేపడుతోంది. డ్రోన్ టెక్నాలజీలో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే ఉన్నతంగా నిలబెట్టేందుకు కార్పొరేషన్ కృషి చేస్తోంది.

అన్ని రంగాల్లోనూ డ్రోన్‌ల వినియోగం..

రానున్న కాలంలో రైతులంతా డ్రోన్‌లను వినియోగించే నైపుణ్యం సాధిస్తారని ఏపీ డ్రోన్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆళ్ల రవీంద్రారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా డ్రోన్‌ల వినియోగం అన్ని రంగాల్లో పెరిగిపోతోందని చెప్పారు. పరిపాలన, పోలీస్, వ్యవసాయం, గనులు, ఇన్సూరెన్స్, మీడియా, వినోద రంగాల్లో డ్రోన్‌లను వినియోగించటం ద్వారా మానవ వనరులు, సమయం, డబ్బు ఆదా అవుతోందని, కచ్చితత్వం ఉంటోందని చెప్పారు. డ్రోన్ వినియోగ నిబంధనలను పౌర విమానయాన శాఖ సడలించినందున డ్రోన్‌ల అభివృద్ధికి పెద్ద ఎత్తున స్టార్టప్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు.

> 'ఎవరైనా డ్రోన్‌ల గురించి మాట్లాడాలంటే.. ముందుగా ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడాలి'
> – సీఎం జగన్ రాష్ట్రంలో డ్రోన్ వినియోగంపై తీసుకున్న చర్యలతో ఫాపిల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ గోపీరాజా గతంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన ఓ వర్క్‌షాప్‌లో చేసిన వ్యాఖ్యలివి.

సమగ్ర భూ సర్వేతో ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమంలో డ్రోన్‌లను పెద్ద సంఖ్యలో వినియోగిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా కిసాన్ డ్రోన్‌లను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. వచ్చే నెలలో మరో 500 కిసాన్ డ్రోన్‌లు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ద్వారా రైతులకు డ్రోన్‌ల వినియోగంలో శిక్షణ ఇస్తున్నారు. పంటలకు ఎరువులు వేయటం, పురుగు మందులు చల్లడం వంటివి డ్రోన్‌ల ద్వారా చేపట్టటం ద్వారా వృథాను అరికట్టడంతో పాటు రైతులను ప్రమాదకర పురుగుమందుల బారి నుంచి రక్షించవచ్చు.

నిబంధనలు సరళతరం..

డ్రోన్‌లు లేదా యూఏవీ (అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికల్)ల నిర్వహణను చట్టబద్ధం చేస్తూ 2021 ఆగస్టు 26న పౌర విమానయాన శాఖ కొత్త పాలసీని ప్రకటించింది. 2022లో నిబంధనలను మరింత సరళతరం చేస్తూ పాలసీలో సవరణలు తీసుకువచ్చింది. 2 కిలోల లోపు బరువు ఉన్న వినోదం కోసం ఉపయోగించే డ్రోన్‌లను ఆపరేట్ చేసేందుకు ఎలాంటి రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ అవసరం లేదు. డ్రోన్‌లను ప్రభుత్వం అయిదు కేటగిరీలుగా వర్గీకరించింది. 250 గ్రాములలోపు బరువు ఉండేది నానో డ్రోన్. 250–2 కిలోల మధ్య బరువు ఉంటే మైక్రో డ్రోన్. 2 కిలోల నుంచి 25 కిలోల మధ్య బరువు ఉండేవి చిన్న డ్రోన్‌లు. 25–150 కిలోల మధ్య బరువు ఉండే డ్రోన్‌లను మధ్యస్త డ్రోన్‌లుగానూ 150 కిలోల పైగా బరువు ఉండేవాటిని పెద్ద డ్రోన్‌లుగానూ వర్గీకరించారు.

అనుమతులు తప్పనిసరి..

నానో, మైక్రో కేటగిరీల్లోని నాన్ కమర్షియల్ డ్రోన్‌లను మినహాయిస్తే మిగిలిన అన్ని రకాల డ్రోన్‌ల ఆపరేషన్‌కు డిజిటల్ స్కై ఆన్‌లైన్ ప్లాట్ ఫాం నుంచి ముందస్తు అనుమతులు పొందాల్సిందే...డ్రోన్‌ల ద్వారా సరుకుల రవాణా కోసం ప్రభుత్వం ప్రత్యేక కారిడార్‌లను నిర్దేశిస్తుంది. రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ పొందాలంటే అధీకృత సంస్థలో నిర్దేశిత కాలం పైలెట్ శిక్షణ పొంది ఉండాలి. శిక్షణ సంస్థ నుంచి పొందిన సర్టిఫికెట్‌తో పాటు నైపుణ్య పరీక్ష తర్వాత నిర్దేశిత ఫీజు చెల్లిస్తే డీజీసీఏ(సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం) పైలెట్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఇది పది సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుంది. ఆ తర్వాత రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. కనీసం టెన్త్ పాసై 18 ఏళ్లకుపైబడి 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థలో శిక్షణ పొందిన ఎవరైనా రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ పొందేందుకు అర్హులే.

డ్రోన్‌ల వేగంపై పరిమితులు..

మైక్రో డ్రోన్ భూమికి 60 మీటర్ల ఎత్తుకుపైన, సెకనుకు 25 మీటర్ల వేగానికి మించి ప్రయాణించరాదు. చిన్న డ్రోన్ 120 మీటర్ల ఎత్తుకుపైగా...సెకనుకు 25 మీటర్ల వేగానికి మించి ప్రయాణించరాదు. మధ్యరకం, పెద్ద డ్రోన్‌లు డీజీసీఏ అనుమతుల మేరకు ఆ పరిధిలోనే ప్రయాణించాలి. నిషేధిత ప్రాంతాల్లో డ్రోన్‌లను ఆపరేట్ చేయటం నేరం. పౌరవిమానయాన శాఖ వెబ్‌సైట్‌లోని మ్యాప్‌లో ఆకుపచ్చ రంగు కలిగిన ప్రాంతంలో డ్రోన్‌లు ప్రయాణించవచ్చు. పసుపురంగు ప్రాంతంలో నిబంధనల మేరకు ప్రయాణించాలి. ఎరుపురంగు సూచించిన ప్రాంతంలో డ్రోన్‌లను అనుమతించరు. అంతర్జాతీయ విమానాశ్రయాల చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలో, ఇతర ఎయిర్‌పోర్టులకు మూడు కిలోమీటర్ల పరిధిలో డ్రోన్‌లను అనుమతించరు. అంతర్జాతీయ సరిహద్దులకు 25 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్‌లను నిషేధించారు. హోం మంత్రిత్వ శాఖ నిర్దేశించిన కీలక ప్రాంతాల్లో డ్రోన్‌ల ఆపరేషన్‌కు ప్రత్యేక అనుమతులు తీసుకోవాలి. రాష్ట్ర రాజధాని ప్రాంతాల్లో సెక్రటేరియట్ కాంప్లెక్సుకు మూడు కిలోమీటర్ల పరిధిలో డ్రోన్‌లను అనుమతించరు. వీటితో పాటు నిషేధిత, ప్రమాదకర ప్రాంతాల్లో డ్రోన్‌లను ఆపరేట్ చేసేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

విపత్కర పరిస్థితుల్లోనూ డ్రోన్ సేవలు..



రక్ష అకాడమీలో డ్రోన్‌ను పరీక్షిస్తున్న దృశ్యం

అకాడమీ ట్రైనర్ జగన్నాథ్ పరిందా మాట్లాడుతూ కొన్ని కష్టతరమైన విధుల నిర్వహణకు డ్రోన్‌లు సహకరిస్తాయన్నారు.. తుపాన్లు, వరదలు, భూకంపాల వంటి విపత్కర పరిస్థితుల్లోనూ, ఉగ్రవాద కార్యకలాపాల నిరోధానికి, శాస్త్రీయ పరిశోధనలకు సైతం డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారని చెప్పారు. 2025 నాటికి డ్రోన్ వినియోగ మార్కెట్ 64 బిలియన్ డాలర్లకు చేరనున్నట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ మద్దతుతో ఈ రంగం వేగంగా వృద్ధి చెందుతోందని, ముఖ్యంగా వ్యవసాయం, నిర్మాణం, మైనింగ్, మీడియా, టెలికమ్యునికేషన్స్, లా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, బీమా, చమురు, గ్యాస్ పరిశ్రమ, రవాణా, విపత్తు నిర్వహణ, సర్వేలు, అడవులు, వన్యప్రాణుల సంరక్షణ వంటి రంగాల్లో డ్రోన్‌లను సమర్థంగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. సాధారణ పైలెటింగ్ నైపుణ్యాలతో పాటు పారిశ్రామిక స్థాయి వినియోగం కోసం శిక్షణ ఇవ్వాలని రక్షా అకాడమీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. బెంగళూరుకు చెందిన స్కైవెంజర్ ఏవియేషన్ భాగస్వామ్యంతో ఇక్కడ శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.

విదేశీ విద్యకు భరోసా

- జగనన్న విదేశీ విద్యా దీవెన నిధుల విడుదల
- తెలుగు వారి కీర్తిని అన్ని దేశాల్లో చాటాలన్న వక్తలు
- జిల్లాలోని లబ్ధిదారులకు రూ.44.36 లక్షల చెక్కు అందజేత



విద్యార్థులకు ' జగనన్న విదేశీ విద్యాదీవెన ' మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: చదువుతోనే పేదల తలరాతలు మారతాయని గట్టిగా నమ్మారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అందుకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. అమ్మఒడి, విద్యాకానుక, నాడు–నేడు కార్యక్రమాలతో పేదల చదువుకు భరోసా కల్పించారు. 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకంతో పేద విద్యార్థులు విదేశాల్లోనూ చదువుకునే అవకాశం కల్పిస్తుండటంపై అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి బటన్‌నొక్కి విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా నుంచి ఎంపికైన నలుగురు విద్యార్థులకు మెగా చెక్కు అందజేశారు.

విదేశాల్లోనూ సత్తా చాటాలి

విదేశాల్లోనూ మన విద్యార్థులు సత్తా చాటాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద విద్యార్థుల విదేశీ విద్యకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ప్రపంచంలో టాప్ 200 ర్యాంకులు ఉన్న విదేశీ విద్యాలయాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, ఈబీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వివరించారు. ర్యాంకును బట్టి యూనివర్సిటీల్లో రూ.50 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకూ విదేశీ విద్యాదీవెన పథకం వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. యూనివర్సిటీ ఫీజు, ట్యూషన్ ఫీజు, విమాన చార్జీలు, వీసా ఖర్చులు అన్నీ ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఫీజును నాలుగు విడతలుగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో తెలుగు వారు సత్తాను చాటాలన్నారు.

పారదర్శకంగా 'విదేశీ విద్య'

అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. విదేశీ విద్య అభ్యసించాలంటే గతంలో ఎస్సీ, ఎస్టీలకు రూ.15 లక్షలు, బీసీ, మైనార్టీలకు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంతో మధ్యలోనే విద్యాభ్యాసాన్ని ఆపేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. అనర్హులకు సైతం బిల్లులు పెట్టిన సందర్భాలు కోకొల్లలు ఉన్నాయని చెప్పారు. అయితే ప్రస్తుతం అర్హత ఉంటే చాలు పారదర్శకంగా విదేశీ విద్య పథకాన్ని అమలు చేస్తూ ఉన్నత విద్యకు భరోసా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి శివరంగప్రసాద్, డీటీడబ్ల్యూఓ మోహన్‌రాం, బీసీ వెల్ఫేర్ అధికారిణి నిర్మలాజ్యోతి, ఏఎస్‌డబ్ల్యూ శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థుల వివరాలు

జిల్లాలోని ఓడీ చెరువు మండలం పగడాలవారిపల్లికి చెందిన గంగులప్ప కుమార్తె డి.అనితకు రూ.82,214 మంజూరైంది. అలాగే హిందూపురం పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు విష్ణుసాయి రాయల్‌కు రూ.17,59,109, కొత్తచెరువు పట్టణంలోని బసవన్నకట్ట వీధిలో ఉండే కే.శివారెడ్డి కుమారుడు రాజశేఖరరెడ్డికి రూ.12,10,883 విడుదల చేశారు. పెనుకొండ మండలం కొండంపల్లికి చెందిన జి.శ్రీహరి కుమారుడు భార్గవసాయికి రూ.13,84,421 కలిపి మొత్తం రూ.44,36,627 మొత్తానికి మెగా చెక్కు అందజేశారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

- విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో శుక్రవారం చేపట్టనున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్ వీసీ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి అరుణ్‌బాబుతో పాటు అధికారులు వీసీలో పాల్గొన్నారు. రీ సర్వే పనులు ఆగష్టు 31 లోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల వద్ద పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, ఉపాధి సిబ్బంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ఎంపీడీఓలు, అటవీశాఖ ,విద్యాశాఖ, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, డ్వామా ,ఉద్యానశాఖ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షం



కొత్తచెరువులో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం వరకూ 477 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా కదిరలో 35.2 మిమీ, ముదిగుబ్బలో 32.2 , కొత్తచెరువు 30.2 , పుట్టపర్తి 29.2 , నల్లమాడ 24.6, ధర్మవరం 22.4, బుక్కపట్నం 21.4, బత్తలపల్లి 20.6 , చెన్నేకొత్తపల్లి 18.4 , తాడిమర్రి, ఎన్‌పీ కుంటలో 18.2 , నల్లచెరువు, కనగానపల్లి, గాండ్లపెంటలో 16.8 మి.మీ వర్షం కురిసింది. అలాగే తనకల్లు 15.6 , రొద్దం 14.6 , రామగిరి, ఓడీసీ 12.4 , పెనుకొండ 12 , హిందూపురం 11.2 , అమరాపురం, లేపాక్షి 9.4 , తలుపుల 9.2, గోరంట్ల 8.6 మి.మీ వర్షపాతం నమోదైంది. 32 మండలాల పరిధిలో 477 మి.మీ వర్షపాతం నమోదు కాగా సగటున 14.9 మి. మీ వర్షం కురిసింది. మరో వారం రోజుల పాటు విత్తన సాగుకు అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: 'ప్రత్యేక ఓటరు సవరణ –2024కు సంబంధించి చేపడుతున్న ఇంటింటి సర్వే పక్కాగా చేపడుతున్నాము. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి' అని డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో ప్రత్యేక ఓటరు సవరణ–2024పై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ ఇంటింటి సర్వేలో ఓటర్ల పరిశీలన జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపులు చేస్తామన్నారు. అపోహలు లేకుండా అన్ని రాజకీయ పార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. 01.01.2024 నాటికి 18 సంవత్సరాలు వయసు ఉన్న యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి సంబంధిత ధ్రువీకరణపత్రాలను బీఎల్‌ఓలకు అందజేయాలన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి, కాంగ్రెస్ మహదేవనాయుడు, బీఎస్పీ సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, బీజేపీ ప్రతినిధి విజయభాస్కర్‌రెడ్డి ,కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఇంతియాజ్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు అల్లాబక్స్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక మొహర్రం



పుట్టపర్తిలో కొలువుదీరిన పీర్లు



పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

- జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో కొనసాగుతున్న వేడుకలు
- 29న జలధితో ముగియనున్న ఉత్సవాలు

పుట్టపర్తి టౌన్: హిందూముస్లింల ఐక్యతకు ప్రతీకగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మొహర్రం వేడకలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామాల్లోని చావిడిలో పీర్లను కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.

గుండం తవ్వకంతో మొదలు

గ్రామాల్లో గుండం తవ్వకాలతో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం ప్రత్యేక ప్రదేశాల్లో భద్రపరచిన పీర్లను వెలికి తీసి శుభ్రం చేసి ప్రత్యేకంగా అలంకరించి 5వ రోజు చావిడిలో ప్రతిష్టిస్తారు. చావిడి వద్ద గుండంలో టన్నుల కొద్దీ కట్టెలు వేసి నిప్పంటిస్తారు. ముజావర్ల ఆధ్వర్యంలో ఆరాధన ప్రక్రియను నిర్వహిస్తారు.మొదటి ఐదు రోజులు చావిడిలో పీర్లను కొలువుదీర్చి ప్రత్యేక ప్రార్ధనలు చేస్తారు. 7వ రోజు చిన్న సరిగెత్తు నిర్వహించి పీర్ల గ్రామోత్సవం చేస్తారు. పదో రోజు పెద్ద సరిగెత్తులో భాగంగా పానకాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అదే రోజు వైభవంగా దీపారాధన ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న పెద్ద సరిగెత్తును అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. అదే రోజు ఉపవాస దీక్షలతో అగ్ని గుండం ప్రవేశం చేస్తారు. అనంతరం నిప్పుల గుండం పూడ్చి దానిమ్మ, తదితర పండ్ల మొక్కలు నాటడం పూర్వం నుంచి వస్తున్న ఆచారం.

మొహర్రంతో నూతన సంవత్సరం ఆరంభం

మొహర్రం అంటే ఉర్దూలో త్యాగం, క్షమాపణ అని అర్థం. ఇస్లాం ధర్మం ప్రకారం మొహర్రం నుంచి ఇస్లామిక్ క్యాలెండర్ ఆరంభమవుతుంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం.. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం ఈ నెల 19న ప్రారంభమై 29తో ముగుస్తుంది. ఇస్లాం ధర్మ పరిరక్షణలో భాగంగా ఇమామ్, హుస్సేన్, తదితర వీరుల సంస్మరణార్థం మొహర్రం నిర్వహిస్తున్నట్లు ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. క్రీ.శ.14వ శతాబ్దంలో ఇరాక్‌లోని కర్బలా ప్రాంతంలో శాంతి స్థాపనకు చేసిన యుద్ధంలో వారు తమ ప్రాణ త్యాగం చేసినట్లుగా చరిత్ర చెబుతోంది. దీంతో అప్పటి నుంచి మొహర్రంను ముస్లింలు సంతాప దినాలుగా నిర్వహిస్తున్నారు.

మద్యం మత్తులో గొంతు కోసుకున్నాడు!

- ఒడిశా వాసి అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ

పెనుకొండ: ఒడిశాకు చెందిన యువకుడి అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. మద్యం మత్తులోనే గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. వివరాలను గురువారం ఎస్‌ఐ రమేష్‌బాబు వెల్లడించారు. పెనుకొండ సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన వికాస్ (27) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. కొంతకాలంగా పెనుకొండలోని ఆల్విన్ కాలనీలో సోదరుడు రాజు, మరి కొందరు కార్మికులతో కలసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతిగా మద్యం సేవించడం అలవాటున్న వికాష్ బుధవారం గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో మద్యం మత్తులో కత్తితో గొంతుకోసుకున్నాడు. ఈ అంశాన్ని తన మొబైల్‌లో రికార్డు చేశాడు. కాగా, తొలుత అనుమానాస్పద మృతి కింద దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతుడి సెల్‌ఫోన్‌లోని దృశ్యాలు చూసి ఆత్మహత్యగా నిర్ధారిస్తూ కేసు నమోదు చేశారు.

ప్రాణదాతలకు కృతజ్ఞతలు

- జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్యాయత్నం
- సకాలంలో స్పందించిన పోలీసులు
- చికిత్స అనంతరం కోలుకుని పోలీసులను కలసి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు



వన్నూరుస్వామితో పోలీసులు

కళ్యాణదుర్గం : జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని పోలీసులు సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి, ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న అనంతరం ఆ యువకుడు పోలీసులను కలసి కృతజ్ఞతలు తెలిపాడు. వివరాలు.. శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన వన్నూరుస్వామి వారం రోజుల క్రితం కుటుంబ సమస్యలతో విసుగు చెంది జీవితంపై విరక్తితో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు రోడ్డు పక్కన పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న యువకుడిని అదే సమయంలో అటుగా వెళ్లిన పట్టణ సీఐ తేజమూర్తి, ఎస్‌ఐ నాగమధు గమనించి, వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న వన్నూరు స్వామి గురువారం కళ్యాణదుర్గానికి వచ్చి నేరుగా తనను కాపాడిన పోలీసులను కలసి కృతజ్ఞతలు తెలిపాడు. తన తల్లి మరణించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు వివరించాడు.

కలికిరి కళాశాల ప్రిన్సిపాల్‌గా విశాలి

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్. విశాలి నియమితులయ్యారు. వర్సిటీ వీసీ జింకా రంగజనార్ధన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి. శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కలికిరి మెకానికల్ విభాగాధిపతిగా డాక్టర్ డీ.ఆర్. శ్రీనివాసన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వెన్నుపోటు బాబు నైజం

- శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం



మాట్లాడుతున్న పురుషోత్తం

పుట్టపర్తి అర్బన్: నమ్మిన వారిని వెన్నుపోటు పొడవడం చంద్రబాబు ప్రధాన నైజమని శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం విమర్శించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా తప్ప వారి అభ్యున్నతికి ఎలాంటి చర్యలూ చంద్రబాబు చేపట్టలేదన్నారు. కార్పొరేషన్ సభ్యులతో కలసి గురువారం పుట్టపర్తికి వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీలంటే బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా నిరూపిస్తూ అన్ని రంగాల్లోనూ బీసీల అభ్యున్నతికి బాటలు వేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే అని కొనియాడారు. బీసీలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ఆయన గురువారం పుట్టపర్తికి విచ్చేసిన పురుషోత్తం తొలుత కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా సత్కరించారు.

కమిటీ సభ్యుల ఎంపిక

శాలివాహన, కుమ్మరి జిల్లా సంక్షేమ కమిటీ సభ్యులను గురువారం ఎంపిక చేశారు. అధికారేతర సభ్యులుగా పరిగి కుమ్మర నాగరాజు, బత్తలపల్లి వెంకటరమణ, గుడిబండ నాగమ్మ, సోమందేపల్లి వెంకటనారాయణ ఎంపికయ్యారు. సభ్యుల నియామక పత్రాలను బీసీ వెల్ఫేర్ డీడీ నిర్మలాజ్యోతి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఏడీ సుబ్రహ్మణ్యం, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ బాలాజీ, సూపరింటెండెంట్ హరిత, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి



ఎంపికైన నిఖ్యాతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరానికి చెందిన క్రీడాకారిణి నిఖ్య ఎంపికైంది. ఈ మేరకు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి గురువారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన నిఖ్యను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఆగస్టు 3 నుంచి 9వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరుపున ఆమె ప్రాతినిథ్యం వహించనున్నట్లు వివరించారు. ప్రతిభ చూపిన నిఖ్యాను గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కిసాన్ సమృద్ధి కేంద్రాలతో ఎంతో ప్రయోజనం

- మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

హిందూపురం టౌన్: ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారనున్నాయని మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలాజీ ట్రేడర్స్, సప్తగిరి ట్రేడర్స్, బృందావన్ ట్రేడర్స్‌ను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా మార్చడంతో వాటిని వ్యవసాయాధికారులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు అండగా నిలిచేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా కిసాన్ సమృద్ధి కేంద్రాలను దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన పనిముట్లను తక్కువ ధరకే అందజేస్తారన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన యంత్రాలు, డ్రోన్లను సబ్సిడీతో అందజేస్తారన్నారు. అలాగే మట్టి పరీక్షలు, విత్తన పరీక్షలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం, ఇంటర్నెట్ సదుపాయంతో రైతులకు అందుబాటులో ఉంచుతారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఏఓ సురేంద్ర నాయక్, బీజేపీ రాష్ట్ర నాయకులు మేడికుర్తి హరి, చంద్రశేఖర్, వరప్రసాద్, ఆదర్శ్‌కుమార్, వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, భాగ్యలక్ష్మి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

- డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్



మాట్లాడుతున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే తమ ప్రథమ కర్తవ్యమని డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డివిజనల్ రైల్వే వినియోగదారుల కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలో సమస్యలు, ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలపై చర్చించారు. పలువురు డీఆర్‌యూసీసీ సభ్యులు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పలుచోట్ల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేశారని, తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమైన నగరాలకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రవేశపెట్టాలని కోరారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఆర్‌యూబీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం డివిజన్‌లోని 17 రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏడీఆర్‌ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఈఎస్ అక్కిరెడ్డి, సీనియర్ డీఓఎం శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

సీఆర్పీలకు శుభవార్త

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్లకు (సీఆర్పీ) శుభవార్త. రెక్వెస్ట్ బదిలీలకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వివరాలను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి (ఏపీఓ), జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 29 మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం దరఖాస్తులను స్క్రూటినీ చేసి తాత్కాలిక మెరిట్ జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు తెలియజేయాలన్నారు. అదేరోజు 3 గంటలకు ఫైనల్ మెరిట్ జాబితా ప్రకటిస్తామన్నారు. తర్వాత కౌన్సెలింగ్ చేపట్టి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించారు ప్రత్యేక కేటగిరీ కింద బదిలీ కోరకునేవారు సంబంధిత స్పౌజ్/మెడికల్/పీహెచ్ సర్టిఫికెట్లను దరఖాస్తుకు జత చేయాలని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న సీఆర్పీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖాతాల్లో 'పీఎం కిసాన్' జమ

- జిల్లాలోని 2.74 లక్షల మంది రైతులకు రూ.54.8 కోట్లు

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ రైతు భరోసా'లో భాగంగా పీఎం కిసాన్ మొదటి విడతను గురువారం రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 జమ చేస్తుండగా కేంద్రం మరో రూ.6 వేలు అందిస్తోంది. ఇందులో భాగంగా మొదటి విడతగా గురువారం జిల్లాలోని 2.74 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున రూ.54.8 కోట్లు జమ చేసింది. ఈ క్రమంలో వ్యవసాయాధికారులు జిలాల్లోని 107 ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల్లో సంబరాలు నిర్వహించారు. ప్రధాని ప్రసంగాన్ని రైతులంతా వినేలా ఏర్పాట్లు చేశారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

చెన్నేకొత్తపల్లి: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. గురువారం చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరాతీశారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాలని సూచించారు. మట్కా, జూద కేంద్రాల నిర్వాహకుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకునేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చిన్నగౌస్, ఎస్‌ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి



పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

6న జాతీయ కవితోత్సవం

పెనుకొండ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఆగస్టు 6న హిందూపురంలో జాతీయ కవితోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, నిర్వాహకుడు ఉమర్‌ఫారూక్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వంద మంది కవులు, 10 మంది విశిష్ట అతిథులు పాల్గొంటారన్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న కవులు, మేధావులు ఈ నెల 30వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 63007 62315, 93469 43336, 94408 05955, 94409 29894, 73822 68554లో సంప్రదించాలని కోరారు.

కనులపండువగా గూగూడు బ్రహ్మోత్సవాలు



పూజలందుకున్న కుళ్లాయిస్వామి

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున స్వామిని ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. స్వామి దర్శన భాగ్యం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం పెద్ద సరిగెత్తు, శనివారం తెల్లవారుజామున 2 గంటలకు గ్రామోత్సవం, ఉదయం 6 గంటలకు అగ్నిగుండం ప్రవేశం, సాయంత్రం 3 గంటలకు గ్రామోత్సవం, జలధి కార్యక్రమం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు రమణకుమారి, ఈఓ శోభ, కో ఆప్షన్ సభ్యురాలు షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, నాయకులు గోపాల్, సూర్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.